క్లుప్తంగా

15న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమరావతి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధి ప్రణాళికతో పాటు ఇతర అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అమరావతి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని ఎండ్రాయి సర్పంచి నాయుడు రాంబాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 75త్యాళ్ళూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కే పెదఇమాంబి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శివకుమారి పాల్గొన్నారు.

పట్టణ సీఐ ప్రభాకర్‌కు ఘన సన్మానం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రభాకర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ అనునిత్యం సేవా భావంతో పనిచేస్తామని, ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలుకు అధిక ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుందని అందరూ సహకరించాలన్నారు. ఆర్యవైశ్య యువజనసంఘం అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ సేవ దృక్పథంతో డ్యూటీ నిర్వహించాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో మరియు సేవా కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి పొత్తూరి హరీష్, ఉపాధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, మీడియా ప్రతినిధులు త్రిపురమల్లు వాసు, సభ్యులు మాచర్ల సత్యనారాయణ, స్వామి ప్రసాద్, గోపి, దేవరపల్లి తేజ, వనమా రాజేష్, చిలకల వాసు, బచ్చు గణేష్, తొమ్మండ్రు నరేష్, దేవరపల్లి కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి స్నేహహస్తాలు చేయూత



అచ్చంపేట: నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ సాయం అందిస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ ముఖ్య సలహాదారు మామిళ్లపలి విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్‌లో 961 మార్కులు సాధించి, ఎంసెట్‌లో 1021వ ర్యాంక్ పొంది నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బీటెక్ ఫ్రీ సీటు సాధించిన సలాది హర్ష శివ ఆకాష్‌కి హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.87,000 చెక్కును మంగళవారం అందించారు. ఇంజనీరింగ్ పూర్తయ్యేంతవరకు ఫీజులు చెల్లించేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ సిద్ధం ఉందని చెప్పారు. సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ స్నేహహస్తాలు ఫౌండేషన్ ద్వారా ఎందరో విద్యార్థులకు ఫీజులు చెల్లించామని, ప్రాజెక్టు వర్కులకు లాప్‌టాప్‌లు అందజేశామని వివరించారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మా శౌరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి



క్రోసూరు: విద్యార్థులు ఇంటర్నెట్‌ను సక్రమ పద్ధతిలో వినియోగించుకోవాలని అమరావతి గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ విన్నరసి సూచించారు. క్రోసూరులోని జెడ్పీ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు ఇంటర్నెట్ వినియోగంపై గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్ ప్రతినిధులు మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల హెచ్ఎం ఇందిరాప్రియదర్శిని, జెడ్పీ పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు, రిసోర్సు పర్సన్ ఎస్.దిలీప్‌కుమార్, కవిత, బాబూరావు, లలితకుమారి బాయి, బత్తుల బాబు పాల్గొన్నారు.

కూరగాయల విత్తనాలు పంపిణీ



గోరంట్లలో విత్తనాలు అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్లలోని ఎస్సీ కాలనీలో కిచెన్ గార్డెన్ ఏర్పాటులో భాగంగా ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. డీబీఆర్సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ, ఆర్గానిక్ పంటల ద్వారా ఆరోగ్యం మెరుగు పరుచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సేవే ప్రాణం సేవే జీవితం సంస్థ డైరెక్టర్ నందిగం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి కిలో చొప్పున మొక్కజొన్న, ఎర్రజొన్నలు, సజ్జలు 21 మందికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 50 మంది డ్వాక్రా మహిళలకు 12 రకాల ఆకు కూరలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. డ్వాక్రా యానిమేటర్ సరోజిని పాల్గొన్నారు.

ఈనెల 15న చలో విజయవాడ



అచ్చంపేటలో చలోవిజయవాడ పోస్టర్స్ విడుదల చేస్తున్న ప్రజానాట్యమండలి సభ్యులు

అచ్చంపేట: అగ్రి గోల్డ్ బాధితులకు న్యాయం కోరుతూ ఈనెల 15వ తేదీ చలో విజయవాడ నిర్వహించనున్నట్లు ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తెలిపారు. చలో విజయవాడ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాగించిన మహోన్నత ఉద్యమ పోరాటాల ఫలితంగా రూ.20వేల లోపు డిపాజిట్ చేసిన వారికి రూ.906 కోట్లను రెండు విడుతలలో ఇప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పాల్గొంటారని చెప్పారు. డిపాజిట్ దారులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, నాయకులు నూకేశ్వరరావు, ప్రసాద్, రామాంజనేయులు, మధు, చిన్న ఆశోక్ పాల్గొన్నారు.

జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెదకూరపాడు: జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీలకు విజయ విద్యావిహార్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలిలో నిర్వహించిన జంప్ రోప్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు హేమ తేజస్విని, గంటమల్లేశ్వరి, బిట్రగుంట బ్రహ్మశ్రీ, కవిత, షేక్ నూర్ అబ్బాస్ జాతీయ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను పాఠశాల సెక్రటరీ కె.శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు నోముల కోటేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వాసంతి, ఉపాధ్యాయులు కె.రాధా, శ్రీదేవి, రజిని, అనిత, లక్ష్మీ, పవన్, రామాంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు వచ్చాయి

- తహసీల్దార్ సుజాత వెల్లడి
- మండలంలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ



యడ్లపాడులో భూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ సుజాత

యడ్లపాడు: దాదాపు వందేళ్ల క్రితం నాటి రికార్డులను పూర్తిగా స్వచ్ఛీకరించి భూముల సమగ్ర రీ సర్వే ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చిందని తహసీల్దార్ జి సుజాత పేర్కొన్నారు. మండలం పరిధిలోని పలు గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఆయా వివరాలను మంగళవారం విలేకర్లకు వెల్లడించారు. మండలం పరిధిలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా భూములను సమగ్ర రీసర్వే చేసినట్లు వివరించారు. కచ్చితమైన కొలతలతో భూములను సర్వే చేసి రైతులకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేయడంతో పాటు ప్రజలకు రికార్డులు సంపూర్ణంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని వివరాలతో తయారు చేసిన భూ హక్కు పత్రాలు (పట్టాదారు పాస్‌పుస్తకాలు) రైతులకు ఇస్తున్నామన్నారు. రీసర్వే వల్ల గ్రామాల్లో చాలా వరకు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. జిల్లా నుండి యడ్లపాడు మండలానికి మొత్తం 9053 మంది రైతులకు తొలి విడతగా భూ హక్కు పత్రాలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో గ్రామాల వారీగా విశ్వనాథ కండ్రి-279, ఉన్నవ-112, యడ్లపాడు-1063, సందెపూడి-440, కారుచోల-1474, జాలాది-1300, తుర్లపాడు-962, మైదవోలు-1110, మర్రిపాలెం-174, వంకాయలపాడు-1139 రాగా ఇప్పటికీ రైతులకు ఆయా పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

15 నుంచి ఆరోగ్య సురక్ష సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ షేక్ జాకీర్ హుసేన్

నాదెండ్ల: ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు మరింత ప్రయోజనం చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుసేన్ చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, వలంటీర్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యులు ప్రియాంక, సాయిశ్వేత, గణపవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్ నాయక్ హాజరయ్యారు. సిబ్బంది అలసత్వం లేకుండా ఈ నెల 15-30 వరకూ ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. స్థానిక వైద్యులతో పాటూ స్పెషలిస్టులైన గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ బృందంచే పద్నాలుగు రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు.

పౌష్టికాహార వారోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎ-సెక్టార్ పరిధిలోని కొండమెట్లబజార్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఎస్పీ పథకం కింద పది రకాల పౌష్టికాహార పదార్థాలు (టీహెచ్ఆర్) టేక్ హోం రేషన్ రూపంలో ఏపీపీ ద్వారా గర్భిణిలు, బాలింతలకు ఫస్ట్ ప్రైజ్(టీహెచ్ఆర్) పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి గాజులు, జాకెట్ ముక్కలు, పండ్లు, తాంబూలం ఇచ్చి ఆశీర్వదించారు. గర్భిణులకు గేమ్ పట్ల అవగాహన కలిగించి పోషక విలువల కలిగిన ఆహారం తీసుకోవాల్సిన చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత నియంత్రించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా దస్తగిరి, సూపర్‌వైజర్ మరియకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌కే మున్ని, ఎస్‌కే షకీలా పాల్గొన్నారు.

దివ్యాంగులకు 14న ప్రత్యేక వైద్య శిబిరం

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని సచివాలయంలో దివ్యాంగులకు ఆర్థోపేం ఉన్న వారికి ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కమిట్‌మెంట్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న మండల కేంద్రంలోని సచివాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తిగా చూపులేని వారు, వినికిడి లోపం గలవారు, స్క్రీనింగ్ క్యాంపులో నిర్ణయించి వారికి ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 2, ఆధార్, సదరన్, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం కమిట్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకో మోటార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓట్ల రీసర్వేపై అభ్యంతరాల పరిశీలనకు అవకాశం

ఆర్డీఓ రాజకుమారి



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఓట్ల రీసర్వే ప్రక్రియలో ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేసేందుకు అవకాశం కల్పించినట్లు ఆర్డీఓ రాజకుమారి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని అందరు ఏఈఆర్ఓలు, అన్ని రాజకీయపార్టీల నేతలతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మార్పులు, చేర్పులపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

అచ్చంపేట ఎంఈఓగా అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా అచ్చంపేట ఎంఈఓ-1గా ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్‌కు పోస్టింగ్ ఇస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో గుంటూరు ఎంఈఓగా పని చేసిన ఖుద్దూస్‌పై శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసిన విషయం విదితమే. తాజాగా సస్పెన్షన్ ఎత్తివేసిన విద్యాశాఖాధికారులు ఆయనకు అచ్చంపేట మండల విద్యాశాఖాధికారి-1గా పోస్టింగ్ కల్పించారు.

చల్లంగా చూడమ్మ పోలేరమ్మ తల్లి



పెదకూరపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి, వ్యాధి బాధల నుంచి చల్లంగా చూడమని గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి రైతులు, వ్యవసాయ కూలీలు పొంగళ్లు పొంగించారు. పెదకూరపాడులోని పోలేరమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళ భక్తులు అమ్మవారికి పొంగళ్లు నివేదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, జి.రఘు, మల్లేశ్వరి, దర్శి శ్రీనివాసరావు, పాల్గొన్నారు. రాత్రి ఆచార్య తుళ్లూరు శివ ఆధ్వర్యంలో కోలాట కార్యక్రమం నిర్వహించారు.

నేడు పెదకూరపాడులో ఎమ్మెల్యే పర్యటన

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పర్యటించనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కొత్త పెన్షన్లు అందించనున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెంలోని సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావటంతో స్వామికి ప్రత్యేక పూజలు, గీతాపారాయణం నిర్వహించారు. 108 సార్లు సామూహిక పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఏడీ శివసాగర్‌బాబు

అందుకూరు(క్రోసూరు): గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగపరుచుకోవాలని పెదకూరపాడు పశుసంవర్ధకశాఖ ఏడీ శివసాగర్‌బాబు కోరారు. మండలంలోని అందుకూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో 149 పశువులకు చికిత్స అందించినట్లు డాక్టర్ మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో వైకుంఠపురం పశువైద్యులు పుణ్యవతి పాల్గొన్నారు.

బీమాపై అవగాహన

నకరికల్లు: జేసీఎస్ యాప్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని చేజర్ల గ్రామంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు ప్రమాద బీమాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో జేసీఎస్ సైన్యం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పొందుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్లపాటి కృష్ణకుమారి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విరాళం

నరసరావుపేట: మండలంలోని ఇసప్పాలెం మహంకాళీ అమ్మవారి దేవస్థానం జీర్ణోద్ధరణ పనులకు హాలీవుడ్ షావు అధినేత చింతగుంట రఘురామిరెడ్డి రూ.1,00,116 విరాళం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గృహంలో ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి ఎమ్మెల్యే గోపిరెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు పాల్గొన్నారు.

కాశీనగర్ సినిమా షూటింగ్ సందడి



సత్తెనపల్లిలో షూటింగ్‌లో పాల్గొన్న సినిమా నటులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లిలో కాశీనగర్-1947 సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శ్రీశ్రీశ్రీ కాసయ్య స్వామి దివ్య ఆశీస్సులతో కదిరి రమాదేవి రెడ్డ నిర్మాతగా శ్రీగణేశదేవీ మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న చారిత్రాత్మక, సెంటిమెంట్ ఆధ్యాత్మిక చిత్రం కాశీనగర్ 1947 పతాక సన్నివేశాలు సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించారు. చిన్న సన్నివేశాలలో ప్రతినాయకుడిగా సత్తెనపల్లికి చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవనాయుడు నటిస్తున్నట్లు చిత్ర దర్శకులు చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్‌పార్క్, కూరగాయల మార్కెట్ సమీపంలోని వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంతంలో షూటింగ్ నిర్వహించారు. హీరో దిలీప్‌రాథోడ్, విలన్‌లపై ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. మరికొన్ని సన్నివేశాలను మునగపాడులోను, నరసరావుపేట రోడ్డులోని ధనలక్ష్మీ రైస్‌మిల్లు లోను షూటింగ్ చేసినట్లు దర్శకుడు తెలిపారు. చిత్ర సమర్పణ శ్రీకాంత్‌రెడ్డి శిరీష, కెమెరా జి.కృష్ణనాయుడు, సంగీతం లక్ష్మణసాయి, కొరియోగ్రఫీ బండ్ల రామారావు, పాటలు జి.సీతారాములు చౌదరి, పోస్ట్‌ప్రొడక్షన్ విజన్ స్టూడియోస్, ఫైట్స్ హుసేన్‌బాయ్, నటులు హీరోయిన్ ఆరోహీ, కేవీఎల్ నరసింహారావు, జెన్నీ, పొట్టి చిట్టిబాబు, సైదా పాల్గొన్నారు.

నీలేశ్వరపాలెంలో..

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాశీనగర్-1947 సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శ్రీగణేష్‌దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చారిత్రాత్మక, సెంటిమెంట్, ఆధ్యాత్మిక చిత్ర పతాక సన్నివేశాలను ఆలయ ప్రాంగణం, కొండపై నుంచి వచ్చే జలపాతాల మధ్య చిత్రీకరించారు.

పేటీయం మిషన్లు ద్వారా స్త్రీనిధి రుణాలు

శావల్యాపురం: ఇక నుంచి స్త్రీనిధి రుణాలు చెల్లింపులు పేటీయం మిషన్లు ద్వారా జరుగుతాయని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చినబుల్లెయ్య మంగళవారం తెలిపారు. మండలంలో మూడు క్లస్టర్లు శావల్యాపురం, వేల్పూరు, కారుమంచి ఎంపిక చేశామని జిల్లాలో పైలట్ ప్రాజెక్టు పథకంలో ఎంపిక చేయగా పేటీయం, క్యూర్ కోడ్, యూపీఐ విధానంలో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయటానికి పేటీయం మిషన్లు అందజేశామన్నారు. ఇప్పటి వరకు యానిమేటర్ల ద్వారా క్యాష్ రూపంలో నగదు చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇక నుంచి నగదు రహిత లావాదేవీల చెల్లింపులు పారదర్శకంగా జరుగుతాయన్నారు. జిల్లాలో త్వరలో స్త్రీనిధి రుణాలు చెల్లింపులు ప్రతి పంచాయతీలో అమలు జరిగేలా చర్యలు తీసకుంటామన్నారు. జిల్లాలో స్త్రీనిధి రుణాలు ఈఆర్థిక సంవత్సరంలో రూ. 142 కోట్లు 28 వేల 400 మంది మహిళా సభ్యురాలకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామని ఇప్పటి వరకు రూ. రూ. 31 కోట్లు 5370 మంది సభ్యులకు రుణాలను అందజేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్త్రీనిధి రుణాలు ద్వారా మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు ప్రతిగ్రూపుల్లోని సభ్యురాలకు రూ. 50 నుంచి రూ. లక్ష వరకు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, బేబిరాణి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో విస్తృత తనిఖీలు

రూ.2 లక్షల 28 వేలు అపరాధ రుసుం విధింపు

మాచవరం: మండలంలోని మాచవరం సెక్షన్ పరిధిలోని కొత్తగణేశునిపాడు, పిల్లుట్ల, కొత్తపాలెం, గోవిందాపురం, తురకపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 39 మంది అధికారులు, 117 మంది సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 3,630 సర్వీసులను పరిశీలించగా అనుమతులు లేకుండా, అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 122 మందికి, సుమారు రూ.2 లక్షల 28 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఏఈ మస్తాన్ తెలిపారు. వీరిలో మీటర్ లేకుండా నేరుగా విద్యుత్ వాడుతున్న 69 మందికి రూ.70 వేలు, మీటర్ ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురికి రూ.31 వేలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుతున్న ఒకరికి రూ.10 వేలు, అనుమతించిన లోడు కంటే అధికంగా విద్యుత్ వినియోగిస్తున్న 46 మందికి రూ.1 లక్ష 17 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు భారత విద్యుత్ చట్టం ప్రకారం నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, లేకుంటే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. దాడుల్లో డీఈఈ లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, టి.వీరేశ్వరావు, ఆపరేషన్ డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్‌లో ప్రతిభ చాటిన జెడ్పీ పాఠశాల విద్యార్థులు

పెదకూరపాడు: హిందీ క్విజ్ పోటీలలో 75 త్యాళ్లూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం శంకర భారతి హైస్కూల్‌లో హిందీ దివస్ పురస్కరించుకుని జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మండల విద్యా శాఖ అధికారి ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

డీసీసీ బ్యాంకును తనిఖీ చేసిన ఏజీఎం

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జీడీసీసీ బ్యాంకును ఏజీఎం బత్తుల బాలకృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. బ్యాంకు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఏడాది బ్యాంకు, సొసైటీల ద్వారా పంపిణీ చేసిన రుణాలను పరిశీలించారు. రుణాల పంపిణీ పై సొసైటీలవారీగా సమీక్షించారు. రైతులకు సకాలంలో రుణాలు అందించాలని బ్యాంకు సిబ్బందికి, సీఈవోలకు సూచించారు. గత ఏడాది పంపిణీ చేసిన రుణాలపై, వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ గూడూరి నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ కుమార్, వినీత, సీఈవోలు శివారెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దీపక్, మల్లయ్య, కోటిరెడ్డి, హనుమంతరావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల) :రూరల్ మండలంలోని బాలాజీ ఐటీఐ కళాశాలలో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 23వ తేదీన జరిగే 4వ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు పదో తరగతి మార్కుల లిస్ట్, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440842030, 8341821710 నంబర్లను సంప్రదించాలన్నారు.

పెదమక్కెన శివాలయంలో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామంలోని గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం అమ్మవారికి 11 మంది పండితులతో ఆలయ ధర్మకర్త వద్దుల వేమారెడ్డి గ్రామస్తుల సహకారంతో లక్ష పసుపు కొమ్ములతో పూజా కార్యక్రమాలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని వేలూరు గ్రామంలో పేకాట స్థావరంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ. 30,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఎస్ రాజేష్ తెలిపారు.